### సీఎం కేసీఆర్ సార్ ఇచ్చిన మాట తప్పడు..



నెన్నెల, అక్టోబర్ 17 : ఎప్పుడైతే బీజేపీ గవర్నమెంట్ వచ్చిందో.. పేదోళ్ల బతుకులు ఆగమయితన్నయి. ఎప్పుడు గ్యాస్ ధరలు పెంచుతరో అర్థంకాకుంటైంది. మాది పెద్ద కుటుంబం. గ్యాస్ మీద వండుకోవాలంటే నెలకో సిలిండర్ అయినా సరిపోదు. గ్యాస్ కోసం నెలకు రూ. 1000 పెట్టుడు మాతో కాదు. కూలీ పనులు చేసుకొని బతికేటోళ్లం. గన్ని పైసలు ఎక్కడి నుంచి వస్తయి. అందుకే అడవికి పోయి కట్టెలు తెచ్చుకొని వంట చేసుకుంటున్నం. కూలీ పనులకు పోయినకాడ కూడా కట్టెలు ఏరుకుంటున్నం. సీఎం కేసీఆర్ సార్ గే ఎలక్షన్ల గెలిస్తే పేదోళ్లకు గ్యాస్ రూ. 400కే ఇస్తమని చెప్పిన్రు. ఆయన మాట తప్పడు. ఆయన గెలిస్తేనే మాకు న్యాయం జరుగుతది. **- మాత్కుల సుశీల, నెన్నెల**

### కేసీఆర్ సర్కారే రావాలి



కోటపల్లి, అక్టోబర్ 17 : ఇది వరకు గ్యాస్ ధర నాలుగు వందల లోపే ఉండే. రాను రానూ మస్తు పెంచిన్రు. మాది పేద కుటుంబం. కూలీ పనులు చేసుకొని బతుకుతం. ఇగ మేమెట్లా గ్యాస్ కొనుక్కుంటం. అందుకే కట్టెల పొయ్యి మీదే వంట చేస్కుంటున్నం. అడవికి పోయి కట్టెలు ఏరుకొని వస్తున్నం. మళ్లా కేసీఆర్ సర్కారు వస్తే రూ. 400లకే గ్యాస్ ఇస్తమని చెప్పిండు. ఇందుకు చాలా సంతోషంగా ఉంది. ఇగ మాకు కట్టెల పొయ్యి బాధ ఉండదు. మళ్లా సిలిండర్ వాడుతం. మళ్లా కేసీఆర్ సర్కారే రావాలని కోరుకుంటున్నం. **- ఎనగందుల రాజక్క, మల్లంపేట**

### పేదోళ్లకు మేలైతది..



దండేపల్లి, అక్టోబర్17 : గ్యాస్ ధరలు మస్తు పెరిగినయ్. గ్యాస్ బుడ్డీతో వండుకునే పరిస్థితి లేదు. పెంచిన రేట్లతో తిప్పలుపడుతున్నం. ఊర్ల అందరూ అంటున్నరు గ్యాస్ బండ రూ.400కే ఇస్తరట. సీఎం కేసీఆర్ సారు మాట ఇచ్చిండట. ఆయన అంటే కచ్చితంగా చేస్తడు. అందుకే గాయనే మళ్లా సీఎం కావాలే.. గట్లయితేనే మాలాంటి పేదోళ్లకు మేలైతది. **- లింగాల వెంకటలక్ష్మి, చింతపెల్లి**

### గ్యాస్ ధర తగ్గిస్తడు.. సౌలత్‌లు చేస్తడు



బెజ్జూర్, అక్టోబర్ 17 : మాకు గ్యాస్ కనెక్షన్ ఉన్నది.. కానీ మస్తు ధర పెరిగిందని పక్కన పెట్టినం. కట్టెల పొయ్యిని వాడుతున్నం. చెట్లపొంటి తిరిగి కట్టెలు ఏరుక వస్తున్నం. కట్టెల పొయ్యిపై వండుకుంటే కండ్లపొంటి నీళ్లు కారుతున్నయి. పాణం మంచిగ ఉంటలేదు. మోదీ సర్కారు మా ఉసురు పోసుకుంటున్నది. సీఎం కేసీఆర్ సార్ మా గరీబోళ్ల బాధలు చేసిండు. గందుకే గ్యాస్‌ను రూ. 400లకే ఇస్తమని చెప్పిండు. కేసీఆర్ సారే ఎట్లాగైన మళ్లా గెలుస్తడు. బరాబర్ మాట నిలబెట్టుకుంటడు. మాలాంటి పేదోళ్లకు అన్ని సౌలత్‌లు చేస్తడు. మా ఆడోళ్లంతా గాయనే గెలువాలని కోరుకుంటున్నరు. **- దుర్గం సుశీల, కుకుడ గ్రామం, బెజ్జూర్**

# రూ.400

- **గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు పకటనపై హర్షాతిరేకాలు**
- **అర్హులైన నిరు పేదలకు బీఆర్ఎస్ బంపర్ బొనాంజా**
- **మ్యానిఫెస్టోలో పేర్కొనడంపై పేదలు, సామాన్యుల సంతోషం**

మంచిర్యాల, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పదేళ్ల క్రితం రూ.400లకు గ్యాస్ సిలిండర్ ఇచ్చిండ్రు.. ఫ్రీ కనెక్షన్ అంటే ఆశపడి పేద, మధ్య తరగతి కుటుంబాలు కనెక్షన్ తీసుకున్నయ్. ఎర్రటి సిలిండర్ బుడ్డి ఇంట్లకి రాంగనే ఇగ పొగతోటి బాధ ఉండదనుకున్నరు. కట్టెల తొటి లొల్లి వొద్దనుకున్నరు. కానీ.. కేంద్రంలో మోదీ సర్కార్ వచ్చినంక గ్యాస్ ధర పెంచుడు మొదలుపెట్టింది. గ్యాస్ రేటు డబుల్ చేసి పేదలపై గుదిబండ మోపింది. దీంతో గిరిజనులు, హరిజనులు, దళితులు, పేదలు అధికంగా ఉండే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల పల్లెలు, గ్రామాల్లో గ్యాస్ కొనుడు బందైంది. ఇంట్లో వంట ఆగింది. మళ్లీ కట్టెలపొయ్యే దిక్కైంది. ఇల్లంత పొగవారింది. కానీ.. ఇప్పుడు తెలంగాణ సర్కార్ గ్యాస్ భారం మొత్తం తామే భరించి పేదలకు రూ.400 పాత ధరకు సిలిండర్ ఇస్తామని ఎన్నికల హామీగా ప్రకటించింది. మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని పెట్టి మరీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. దీంతో గ్యాస్ గోస తప్పనుందని, సీఎం కేసీఆర్ తీసుకుంది గొప్ప నిర్ణయమని అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ ధర పెరిగిందనే వాడడం మానేసి, కట్టెల పొయ్యి వాడుతున్నమని, తెలంగాణలో మళ్లో సారి కేసీఆర్ సర్కార్ వస్తే పక్కన పెట్టిన సిలిండర్ బుడ్డిని మళ్లీ ఎలిగిస్తామని చెప్తున్నరు. సారు చెప్పిండంటే చేసి చూపుతడని, రూ.400 గ్యాస్ సిలిండర్ ఆయనతోనే సాధ్యమైతదంటున్నరు. పేదల కష్టాలు ఎరిగి అందరి బాధలు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అద్భుతమైన మ్యానిఫెస్టోను బీఆర్ఎస్ తీసుకొచ్చిందంటున్నారు. మరోసారి బీఆర్ఎస్ గెలవడం ఖాయమని, ఇచ్చిన హామీలు అమలవడం పక్కా అని ధీమా వ్యక్తం చేస్తున్నరు.

### కేసీఆరే మళ్లా సీఎం అయితడు..



లింగాపూర్, అక్టోబర్ 17 : గ్యాస్ ధర పెరిగినప్పటి నుంచి కట్టెల పొయ్యే వాడుతున్నం. మస్తు తిప్పలైతంది. పొగతో పాణం మంచిగుంటలేదు. కూలీ పనులు చేసుకొని బతికేటోళ్లం.. ఇగ గ్యాస్ ఎట్లా నింపుకునుడు. తప్పకుండా కేసీఆర్ సారే మళ్లా సీఎం అయితడు. గ్యాస్ ధర తగ్గిస్తడు. నాకు ఆ నమ్మకముంది. మళ్లా కారు గుర్తుకే ఓటేస్తం. గింత మంచి పనులు చేసేటోళ్లను ఎందుకు పోగొట్టుకుంటం. **- రాథోడ్ కవిత, లింగాపూర్**



### మళ్లా కేసీఆరే రావాలే..

తిర్యాణి,అక్టోబర్17 : బీఆర్ఎస్ పార్టీ మరోసారి గెలిస్తే రూ. 400లకే గ్యాస్ సిలిండర్ ఇస్తమని చెప్పిన్రు. సీఎం కేసీఆర్ అంటే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటడు. ఇప్పుడున్న ధరతో గ్యాస్ నింపుకోలేక పోతున్నం. కట్టెల పొయ్యి మీద వంట చేసుకోవాల్సి వస్తుంది. గా కట్టెల కోసం కూడా అడివికి పోతే ఫారెస్టోళ్లు అడుకుంటున్నంరు. మస్తు తిప్పలైతంది. అందుకే మళ్లా కేసీఆర్ సారే సీఎం కావాలే. గప్పుడే మా గోస పోతది. **- కర్వేత మోతుబాయి, తిర్యాణి**

### కేసీఆర్ సార్‌పై గట్టి నమ్మకం..



కోటపల్లి, అక్టోబర్ 17 : సీఎం కేసీఆర్ సార్ ఆడబిడ్డల కోసం ఎన్నో మంచి పనులు చేసిండు. గ్యాస్ రూ. 400లకే ఇస్తమని చెప్పిండు. ఇందుకు మస్తు ఖుషీగా ఉంది. మళ్లా బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం. మరోసారి కేసీఆరే సీఎం అయితడు. సిలిండర్‌ను తప్పక రూ.400లకే ఇస్తడు. అడుగకుండానే ఎన్నో చేసిండు. ఆయనపై మాకు గట్టి నమ్మకం. మిగతా వాళ్లను నమ్ముకుంటే మోసపోవుడే. అందుకే మేమంతా బీఆర్ఎస్ వెంటే ఉంటం. **- గోనె గంగమ్మ, షట్‌పల్లి**

### మా గోస తీరుతది..



దండేపల్లి, అక్టోబర్17: సీఎం కేసీఆర్ గరీబోళ్లకు రూ.400లకే గ్యాస్ బండ ఇస్తామని చెప్పిండు. ఇందుకు మస్తు ఆనందంగా ఉంది. ఇప్పుడున్న ధరలతో గ్యాస్ బండ కొనలేని పరిస్థితి ఉంది. మాలాంటి పేదోళ్లకు పూట గడవడమే కష్టం.. అట్లాంటిది ఇగ గ్యాస్ ఎట్లా కొంటం. అడవికి పోయి కట్టెలు తెచ్చుకొని పొయ్యిమీద వండుకుంటున్నం. మళ్లా కేసీఆర్ సర్కారు కచ్చితంగా వస్తది. మా గోస తీరుతది. **- ఏదుల భీమక్క, కుంటలగూడ**

### సంతోషంగా ఉంది..



సిర్పూర్(యు), అక్టోబరు 17 : కేంద్ర సర్కారోళ్లు గ్యాస్ ధరలు ఘోరంగా పెంచిన్రు. మాది పేద కుటుంబం. ఇగ గ్యాస్ ఎట్లా వాడుడు. గ్యాస్‌ను మూలకు పెట్టినం. కట్టెలు ఏరుకొచ్చుకొని పొయ్యి మీద వంట చేసుకుంటున్నం. పొగకు కండ్లు మండుతున్నయి. మస్తు తిప్పలైతంది. ఎలక్షన్లు అయిపోయినంక గ్యాస్‌ను రూ. 400లకే ఇస్తమని సీఎం కేసీఆర్ సార్ చెప్పిండు. మస్తు సంతోషమైతంది. **- గేడం ఇంద్రబాయి, అల్లీగూడ**

# ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- **కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**
- **కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ పరిశీలన**
- **నోడల్, వీడియో సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో సమీక్ష**



ఆసిఫాబాద్ : ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ సహదేవరావు

ఆసిఫాబాద్, అక్టోబర్ 17 : అసెంబ్లీ ఎన్నిల్లో భాగంగా సీ-విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్‌ను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలనారు. సీ- విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే క్షేత్రస్థాయిలో ఉండే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు చేరవేసి, తక్షణమే పరిష్కరించేలా అనుసంధానం చేయడంతో పాటు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అన్ని ఫిర్యాదులను రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. నవంబర్ 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ స్వీకరణ, 13న నామినేషన్ల పరిశీలన, 15న నామినేషన్ ఉపసంహరణ, 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ జరుగుతాయని వివరించారు. ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5 వరకు అమలులో ఉంటాయని తెలిపారు. కంట్రోల్ రూమ్ నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి గౌతమ్, రాము, శ్రీకాంత్ సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అధికారులతో సమీక్ష..

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 17 : కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు నోడల్, వీడియో సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. సీ విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, పట్టుబడిన నగదును సీజ్ చేసి జిల్లా కోశాధికారి కార్యాలయానికి తరలించి అధికారికి అప్పగించాలని తెలిపారు. సమావేశంలో నోడల్, ఫ్లయింగ్ స్క్వాడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501-All
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం-16k to 18k ఏజెంట్ కమిషన్ 6k, Ph: 9640468899, 9640258899.
NT-310252-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677